

హలో ఆకాశవాణి

పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురంలో ఆకాశవాణి కేంద్రాన్ని ప్రారంభించి నేటికి సరిగ్గా 31 ఏళ్లు పూర్తయింది. రేడియో కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యాయి. - 8లో..



పాకల తీరంలో సోనా బోట్ల హల్‌చల్

తమిళనాడు రాష్ట్రం కడలూరుకు చెందిన 90 సోనాబోట్లు గురువారం సింగరాయకొండ మండలం పాకల సముద్ర తీరంలో చేపల వేట సాగించి హల్‌చల్ చేశాయి. - 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32/26

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

బడిలో రాజకీయ రచ్చ

సరస్వతీ నిలయాల్లోనూ పచ్చ పెత్తనం మొదలైంది. ప్రభుత్వ పాఠశాలల బాగోగులు చూడాల్సిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో సైతం టీడీపీ శ్రేణులు పేట్రేగిపోయాయి. కొన్నిచోట్ల ఏకంగా బెదిరింపుల పర్వానికి తెరదీశాయి. అధికార అహంకారంతో పోలీసులను అడ్డంపెట్టుకుని నీచ రాజకీయాలకు పాల్పడ్డాయి. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన తల్లిదండ్రులు ఎన్నికల్లో పోటీ చేయకుండా, ఓటింగ్‌లో పాల్గొనకుండా అడ్డుకున్నాయి. ఏకంగా అధికారులపై దౌర్జన్యం చేసి ఏకగ్రీవమైన చోట కూడా ఎన్నికలను రద్దు చేయించాయి.

- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ చిల్లర రాజకీయాలు
- కమిటీలను కైవసం చేసుకునేందుకు అడ్డదారులు
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై కుట్రలు
- తల్లిదండ్రులు పోటీచేయకుండా, ఎన్నికల్లో పాల్గొనకుండా బెదిరింపులు
- అధికారులపై ఒత్తిళ్లు..పలు చోట్ల అవకతవకలు



వై.పాలెం హైస్కూల్లో గుంపులుగా చేరిన టీడీపీ నాయకులు

ఒంగోలు, సాక్షి ప్రతినిధి: ప్రభుత్వ విద్యానిలయాల్లో రాజకీయాలకు అతీతంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ, జిల్లాలో గురువారం నిర్వహించిన ఎస్‌ఎంసీ ఎన్నికలు అందుకు భిన్నంగా సాగాయి. ఎలాగైనా మొత్తం కమిటీలు కూటమికే దక్కాలనే ఉద్దేశంతో ఆ నేతలు అరాచకాలకు పాల్పడ్డారు. చివరకు అధికారులపై కూడా ఒత్తిడి తెచ్చారు. ఎస్‌ఎంసీ ఎన్నికల సమయంలో పాఠశాలల వద్ద పోలీసు బందోబస్తు అవసరమంటూ 159 చోట్ల పోలీసు బందోబస్తును విద్యాశాఖ అధికారులు కోరారంటే.. కూటమి నేతల ఒత్తిడి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలో కొన్నిచోట్ల మొదట ప్రశాంతంగా ఎన్నికైనప్పటికీ.. కూటమి నేతలు పట్టుబట్టడంతో లేదులేదంటూ.. ఎన్నిక జరగలేదని వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించేశారు. సాధారణ ఎన్నికల మాదిరిగా పాఠశాలల్లో కూడా రాజకీయాలకు పాల్పడ్డారు. దీంతో చాలామంది తల్లిదండ్రులు ఓటింగ్‌కు సైతం ముందుకు రాలేదు. ఫలితంగా 84 పాఠశాలల్లో కోరం లేదనే కారణంతో ఎన్నికలు జరగలేదు. విద్యార్థుల సంక్షేమం, భవిష్యత్తు, పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా కొనసాగే పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో సైతం జోక్యం చేసుకుని పచ్చ పార్టీ నేతలు చెలరేగిపోవడంపై తీవ్ర స్థాయిలో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 2,405 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, 2002 పాఠశాలల్లో ఏకగ్రీవమైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు అధికారికంగా ప్రకటించారు. 310 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. 84 చోట్ల కోరం లేదనే కారణంతో ఎన్నికలు నిర్వహించలేకపోయామని, వాయిదా వేశామని ప్రకటించారు. 9 చోట్ల కోర్టు కేసులు, ఇతర కారణాలతో ఎన్నికల నిర్వహణకు అవకాశం లేకుండా పోయింది. కూటమి నేతల తీరుతో ఎన్నికలు జరిగినచోట ఉద్రిక్తతలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

యర్రగొండపాలెంలో ఏకపక్షం...

నియోజకవర్గంలో పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయి. అధికారపార్టీ ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 306 పాఠశాలలకుగానూ 27 పాఠశాలల్లో ఎన్నికలను వాయిదా వేశారు. పుల్లలచెరువు మండలం మానేపల్లి పాఠశాలలో టీడీపీకి చెందిన ఇరువర్గాలు పోటీపడ్డాయి. ఒక్కో ఓటుకు రూ.5 వేల ప్రకారం ఖర్చు పెట్టినట్లు సమాచారం. మర్రివేముల మండల పరిషత్ పాఠశాలలో కోరం ఉన్నా జనసేన నాయకులు వాయిదా వేయాలని గొడవకు దిగారు. ఎన్నికలు జరిగే వరకు తాము బయటికి వెళ్లమని విద్యార్థుల తల్లిదండ్రులు రాత్రి 7 గంటల వరకు పాఠశాలలోనే ఉన్నారు. యర్రగొండపాలెం మండలం చెన్నరాయునిపల్లె మండల పరిషత్ పాఠశాలలో కోరం ఉన్నా టీడీపీ వర్గీయులు ఎన్నికల్లో పాల్గొనలేదని ఆ పాఠశాల హెచ్‌ఎం వాయిదా వేశారు. యర్రగొండపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 9 గంటలకే టీడీపీ నాయకులు తిష్టవేసి తమ వర్గానికి చెందిన వారిని ఏకగ్రీవంగా ఎంపిక చేయించారు. వైఎస్సార్ సీపీకి చెందిన పేరెంట్స్ ఎక్కువ మంది ఉన్న పాఠశాలల్లో ఎన్నికలను వాయిదా వేయించుకున్నారు.

హెచ్‌ఎం ధ్రువీకరణ పత్రం అందజేసినా..

తర్లుపాడు మండలంలో ఎస్‌ఎంసీ ఎన్నికలు అధికార పార్టీ రాజకీయ నిరుద్యోగులకు అవకాశంగా మారాయి. ఫతేపురం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక పూర్తి చేసి హెచ్‌ఎం ధ్రువీకరణ పత్రం అందజేశారు. కానీ, టీడీపీ స్థానిక నాయకులు ఎంఈఓ సుజాతపై ఒత్తిడి చేయడంతో కోరం లేక వాయిదా వేసినట్లు ప్రకటించారు.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల నిర్బంధం...

ప్రశాంతంగా జరగాల్సిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలను పీసీ పల్లి మండలంలో భయంగుప్పిట్లో పోలీసుల పహారా మధ్య ఏకపక్షంగా నిర్వహించారు. కూటమి నేతల ఒత్తిడితో అన్ని పాఠశాలల్లో వైఎస్సార్ సీపీ నాయకులు పోటీ చేయకుండా నిర్బంధించి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులెవరినీ పాఠశాలలవైపు పోనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు.

ఈదుమూడిలో ఉద్రిక్తత...

నాగులుప్పలపాడు మండలంలోని ఈదుమూడి జెడ్పీ హైస్కూల్లో టీడీపీలోని రెండు వర్గాలు చైర్మన్ పదవి కోసం పావులు కదిపాయి. దీంతో పాఠశాల వద్ద కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎస్సై బ్రహ్మనాయుడు ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించి వేశారు. ఘర్షణ వాతావరణం కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికకు హాజరుకాలేదు. చివరకు కమిటీ ఎంపిక ఆగిపోయింది.

నేతివారిపాలెంలో ఇరువర్గాల వాదనలు...

కొండపి మండలంలోని నేతివారిపాలెంలో ఎస్‌ఎంసీ ఎన్నికలు ఉద్రిక్తతకు దారితీశాయి. టీడీపీకి చెందిన ఇరువర్గాల మధ్య వాదనలు జరగడంతో కొండపి ఎస్‌ఐ కృష్ణ బాజీబాబు తన సిబ్బందితో కలిసి వారిని అక్కడి నుంచి పంపించివేశారు. అనంతరం ఎన్నికలు సజావుగా జరిగాయి.

బాదినేనిపల్లెలో వాగ్వాదం...

రాజకీయ కారణాలతో కొమరోలు మండలం బాదినేనిపల్లె ఎంపీయూపీ పాఠశాలలో ఎన్నికలు వాయిదా వేశారు. పాఠశాల చైర్మన్‌గా పందనబోయిన చంద్రశేఖర్ పోటీ చేశారు. చైర్మన్‌గా మరో వ్యక్తి పోటీలో లేరు. కానీ, కోరం లేకపోవడంతో ఎస్‌ఎంసీ ఎన్నికను నిలిపివేసినట్లు హెచ్‌ఎం సుజాత ప్రకటించారు. తల్లిదండ్రులు ఉదయమే పాఠశాలకు చేరుకున్నా.. కోరం లేకుండా చేయడానికి టీడీపీ నాయకులు బెదిరించడంతో వెళ్లిపోయారని చంద్రశేఖర్ ఆరోపించారు. చివరకు కోరం లేకపోవడంతో ఎన్నిక వాయిదా పడిందని తెలిపారు. దీంతో చంద్రశేఖర్ సహా మరో ఆరుగురు తల్లిదండ్రులు తమ పిల్లలకు టీసీలు ఇవ్వాలని హెచ్‌ఎం సుజాతను కోరారు. పాఠశాల సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఎస్సై మధుసూదన్‌రావు జోక్యం చేసుకుని పంపించి వేశారు.



టీసీలు కావాలని బాదినేనిపల్లె హెచ్‌ఎం సుజాతను కోరుతున్న తల్లిదండ్రులు

ప్రియుడి మోజులో భర్త హత్య?

- ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం
- నోట్లో మద్యం పోసి ఉరి వేసిన వైనం
- హతుడి తల్లిదండ్రుల ఫిర్యాదుతో లోతుగా దర్యాప్తు
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- విచారణలో నేరం అంగీకరించినట్లు సమాచారం



నరేంద్రబాబు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రియుడి మోజులో పడిన ఓ వివాహిత కట్టుకున్నవాడిని అంతమొందించింది. ఆత్మహత్యగా చిత్రీకరించి అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టడంతో నివ్వెరపోయే నిజాలు వెలుగుచూశాయి. పొదిలి పట్టణంలో ఆగస్టు 3వ తేదీన చోటుచేసుకున్న ఈ దారుణ ఘటన వివరాలిలా ఉన్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. పొదిలికి చెందిన చల్లా వెంకట నరేంద్రబాబు ఒంగోలులోని పీఎఫ్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు దాదాపు ఎనిమిదేళ్ల క్రితం లక్ష్మీ ప్రియతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే లక్ష్మీ ప్రియకు పొదిలిలోని నేతపాలేనికి చెందిన ఒక డాక్యుమెంట్‌రైటర్‌తో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. ప్రియుడి మోజులో పీకల్లోతున కూరుకుపోయిన ఆమె ఎలాగైనా భర్తను అడ్డు తొలగించుకోవాలని భావించింది. ప్రియుడు కూడా అందుకు అంగీకరించడంతో హత్యకు పథకం రచించారు. పొదిలిలోని టుబాకో బోర్డు పక్కన ఉన్న డాబాలో కింది పోర్షన్‌లో మృతుడి తలిదండ్రులు చల్లా వెంకటేశ్వర్లు, ఓబులమ్మ నివాసం ఉంటున్నారు. పైన పోర్షన్లో నరేంద్ర భార్యాబిడ్డలతో కలిసి ఉంటున్నారు. ఈ నెల 3వ తేదీ రాత్రి లక్ష్మీప్రియ ప్రియుడు, మరో ఇద్దరితో కలిసి మెడకు తాడు బిగించి హతమార్చారు. ఆ తరువాత ఉరి వేసుకున్నట్లు చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. చనిపోయిన నరేంద్ర నోట్లో మద్యం పోసి.. మద్యం మత్తులో భార్యతో ఘర్షణకు దిగి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య కట్టుకథ అల్లింది. అయితే ఉరి వేసిన తాడు కిందకు వేలాడుతుండటం.. నరేంద్ర శరీరంపై గాయాలు కనిపించడం, కోడలి చేతిపైన గాయాలు ఉండటాన్ని గమనించిన మృతుడి తండ్రి హత్య చేశారని భావించారు. కోడలిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తీగలాగడంతో డొంకంతా కదిలింది. రెండు రోజుల క్రితం పొదిలిలోని ఒక రెస్టారెంటులో మద్యం సేవిస్తున్న డాక్యుమెంట్ రైటర్‌తో పాటు మరో ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో దర్యాప్తు ప్రారంభించారు. తొలుత తమకు ఏమి తెలియదంటూ బుకాయించినప్పటికీ ఆ తరువాత మొత్తం విషయాన్ని కక్కేసినట్లు తెలిసింది. మృతుడు నరేంద్ర యూపీఎస్సీ ఫలితాల్లో స్వల్ప మార్కుల తేడాతో ఐపీఎస్ మిస్సయినట్లు తెలుస్తోంది. పూర్వ ఎస్పీ సిద్ధార్థ కౌశల్, కనిగిరి ప్రాంతానికి చెందిన మరో ఐపీఎస్ ఆఫీసర్‌కు నరేంద్ర స్నేహితుడని తెలిసింది. నరేంద్రతో కలిసి పరీక్షలు రాసిన వారిలో పలువురు ఇపుడు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నత పదవుల్లో కొనసాగుతున్నారు. తమ మిత్రుడి మరణానికి కారణమైన వారిని శిక్షించి, ఆ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని పట్టుదలతో ఉన్నట్లు సమాచారం.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



తీవ్రంగా గాయపడిన ఈశ్వరమ్మను పరిశీలిస్తున్న ఎస్సై శ్రీరామ్

సింగరాయకొండ: ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ(50) మృతి చెందిన సంఘటన గురువారం మధ్యాహ్నం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట గ్రామం ఎస్టీ కాలనీకి చెందిన యాదగిరి ఈశ్వరమ్మ వ్యక్తిగత పనులపై సింగరాయకొండకు వచ్చింది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నడిచి వెళ్తున్న ఆమెను ఇన్ గేట్ గుండా లోపలికి వెళ్తున్న అల్ట్రా డీలక్స్ బస్సు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమై పడిపోయింది. ఈ క్రమంలో బస్సు వెనుక టైరు కింద పడి అపస్మారక స్థితిలో ఉన్న ఈశ్వరమ్మను ఎస్సై టి శ్రీరామ్, సిబ్బంది స్వయంగా 108లో ఎక్కించి కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలోనే ఆమె మరణించింది. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు జింకలు మృతి



మృతి చెందిన జింకలు

పొదిలి రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు జింకలు మృతి చెందిన సంఘటన పొదిలి మండలంలోని ఉప్పలపాడు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. విధి నిర్వహణలో భాగంగా ఒంగోలు వెళ్లి వస్తున్న పొదిలి సీఐ మల్లికార్జునరావు, ఎస్సై జి.కోటయ్య తమ వాహనాన్ని ఆపి విగతజీవులుగా పడి ఉన్న జింకలను పరిశీలించారు. ఫారెస్టు అధికారులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని జింకల కళేబరాలను తీసుకెళ్లారు.

నిలకడగా వర్జీనియా పొగాకు ధర

ఒంగోలు సెంట్రల్: వర్జీనియా పొగాకు ధర నిలకడగా ఉంది. ఒంగోలు రీజియన్ పరిధిలో గురువారం గరిష్టంగా కేజీ రూ.359 ధర పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో 9,749 బేళ్ల వేలానికి ఉంచగా 8,359 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. కనిష్టంగా రూ.204, సరాసరి ధర రూ.312.64 పలికింది.

తేలు కాటుతో యువకుడు మృతి



రంగస్వామి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

బేస్తవారిపేట: తేలు కాటుకు గురై యువకుడు మృత్యువాత పడిన సంఘటన బేస్తవారిపేట మండలంలోని వంగపాడులో గురువారం చోటుచేసుకుంది. రాచర్ల మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన పులిచింతల రంగస్వామి(28) ఐదేళ్ల క్రితం బేస్తవారిపేట మండలంలోని వంగపాడుకు చేరుకున్నారు. బంధువుల సహకారంతో కూలీ పనులు చేసుకుంటూ అద్దె ఇంట్లో జీవిస్తున్నాడు. జేసీ అగ్రహారం గ్రామంలో వేప, చిల్లకంప మొద్దులు ట్రాక్టర్‌కు ఎత్తేందుకు కూలీ పనులకు వెళ్లాడు. మొద్దులు ఎత్తే సమయంలో తేలుకాటుకు గురయ్యాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన రంగస్వామిని తోటి కూలీలు ఆటోలో బేస్తవారిపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అప్పటికే రంగస్వామి మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. రంగస్వామి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య నాగేశ్వరి ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి. రంగస్వామి మృతితో భార్య, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరు దుర్మరణం



రోడ్డుపై రామిరెడ్డి మృతదేహం

దర్శి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కర్రల లోడ్ ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి పాపిరెడ్డిపాలెం సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. పాపిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రైతు వెన్నపూస రామిరెడ్డి(52) వ్యక్తిగత పని మీద ముండ్లమూరు వెళ్లి వస్తున్నాడు. ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన ఆయనను ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబళించింది. ముండ్లమూరు వైపు కర్రల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి ఉంటాడని అనుమానిస్తున్నారు. రామిరెడ్డికి తలపై తీవ్ర గాయమై రోడ్డుపై రక్తం ఏరులైంది.

హలో.. ఆకాశవాణి..

మార్కాపురం ఆకాశవాణి కేంద్రం ప్రజలకు మరింత చేరువవుతోంది. ప్రజోపయోగ కార్యక్రమాలు నిర్వహిస్తూ, యువత, అన్నదాతల సందేహాలు నివృత్తి చేస్తూ.. సంస్కృతి సంప్రదాయాలను వివరిస్తూ.. సాహిత్యాభిలాషులను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతున్న రేడియో కేంద్రం నేటితో 31 వసంతాలు పూర్తి చేసుకుంది. మూడు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో లక్షలాది మంది శ్రోతల అభిమానాన్ని చూరగొంది. గతంలో రేడియో ఉంటేనే ఆకాశవాణి ప్రసారాలు వినాల్సిన పరిస్థితి. కానీ ఇప్పుడు మొబైల్ యాప్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడి నుంచైనా మార్కాపురం ఆకాశవాణి ప్రసారాలు వినొచ్చు.

- ప్రజలకు మరింతగా చేరువైన రేడియో కార్యక్రమాలు
- రేడియో కేంద్రం ప్రారంభమై నేటికి 31 వసంతాలు



మార్కాపురం ఆకాశవాణి కేంద్రం

మార్కాపురం: జిల్లాలోని పశ్చిమ ప్రకాశం ముఖ్య కేంద్రమైన మార్కాపురం పట్టణంలో ఆకాశవాణి కేంద్రం ప్రారంభమై నేటికీ సరిగ్గా 31 సంవత్సరాలు. బహుజన హితాయా... బహుజన సుఖాయా అంటూ విజ్ఞానం, వినోదం, చైతన్యం నినాదాలతో ఆకాశవాణి ప్రజలకు చేరువైంది. 1993 ఆగస్టు 9న నాటి ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కరరెడ్డి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. 101.5 మెగా హెడ్జ్‌పై ప్రారంభమైన మార్కాపురం ఆకాశవాణి కేంద్రం తొలినాళ్లలో 75 కిలోమీటర్ల వరకు రేడియో ప్రసారాలు వినిపించేది. అయితే ఇప్పుడు ఆండ్రాయిడ్ ఫోన్‌లో ప్రసారభారతి న్యూస్ ఆన్ ఎయిర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే ప్రపంచంలో ఎక్కడ ఉన్నా ప్రసారాలు వినవచ్చు. ప్రస్తుతం మార్కాపురం రేడియోకు తెలుగు రాష్ట్రాలతో పాటు బెంగుళూరు, చెన్నై నుంచి కూడా శ్రోతలు రోజూ ఫోన్లు చేసి తమకు ఇష్టమైన పాటలు అడుగుతుంటారు. ఎప్పటికప్పుడు శ్రోతలు మెచ్చే విధంగా వినూత్న కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నారు. స్థానికంగా జిల్లాలో ఉండే కళాకారులను, కవులను ప్రోత్సహించేందుకు జానపద రంజని, కవి సమ్మేళనం, కవితలు ప్రసారం చేస్తున్నారు. సంక్రాంతి, ఉగాది, తదితర పర్వదినాల్లో కవి సమ్మేళనాలు నిర్వహిస్తూ కవులను ప్రోత్సహిస్తున్నారు.

రోజూ వినూత్న కార్యక్రమాలు

మార్కాపురం రేడియో కేంద్రంలో రోజూ రైతుల కోసం కిసాన్‌వాణి, యువత కోసం క్విజ్ టైమ్, కరెంట్ అఫైర్స్, మహిళల కోసం మహిళా భారతి, నాలుగు మంచి మాటల కోసం సూక్తి ముక్తావళి డాక్టర్లతో సలహాలు, హలో ఎఫ్ఎంతో యువత కోరే పాటలు, ఇలా రోజూ వినూత్న కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నారు. రైతుల కోసం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో రోజూ 40 నిమిషాల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువత కోసం రోజూ అర్ధ గంట పాటు కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నారు. ప్రధానంగా క్విజ్ టైమ్, కిసాన్‌వాణి, హలో ఎఫ్ఎం కార్యక్రమాలు శ్రోతల మన్ననలు పొందుతున్నాయి. వీటితోపాటు పాటకు వేళాయెరా, గీతమాలిక తదితర కార్యక్రమాలు కూడా శ్రోతల నుంచి ప్రశంసలు పొందాయి. డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి అందించే మనవూరి పేరులో ఏముంది ధారావాహిక, ఇంకా సైన్స్ సీరియల్స్ శ్రోతల మనసుల్లో నిలిచిపోయాయి. గతంలో స్టేషన్ ప్రసారాలు సాయంత్రం 5 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఉండేవి. కాలానుగుణంగా ప్రజల కోసం ప్రస్తుతం ఉదయం 5.52 గంటల నుంచి రాత్రి 11.10 గంటల వరకు ప్రసారాలు వినిపిస్తున్నారు.

వృద్ధి పథంలో ఉద్యోగుల కృషి

కేంద్రం ప్రారంభంలో ఉన్న అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్లు వై.హనుమంతరావు, ఆ తర్వాత వచ్చిన కేవీ హనుమంతరావు, కృష్ణకుమారి, పాండు రంగ, పి.సి.వి.సత్యనారాయణ, కృష్ణ మోహన్, ఎస్.సుధాకర్, దేవదాసు, చిట్టిబాబు, సూర్యప్రకాష్, చిట్టిబాబు, మహేష్, నాగేశ్వరరావు, ఖుద్దూస్, బేతా రామ సూర్యప్రకాశరావుతో పాటు ప్రస్తుతం ప్రోగ్రామ్ హెడ్‌గా ఉన్న పి.ప్రశాంత్ కిరణ్, జి.దివ్య శ్రోతలు మెచ్చే కార్యక్రమాలు ప్రసారం చేస్తుండటంతో ఆకాశవాణి ప్రజలకు చేరువైంది. ఇక సాంకేతిక సిబ్బంది సహకారంతో నాణ్యమైన ప్రసారాలు అందుతున్నాయి. స్టేషన్ ప్రారంభమైనప్పుడు 6 కిలో వాట్స్ ఉండగా, ప్రస్తుతం దానిని 10 కిలో వాట్స్‌కు పెంచారు. దీని వల్ల సాధారణ రేడియోల్లో 100 కిలోమీటర్ల వరకు కార్యక్రమాలు వినిపిస్తాయి. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ స్టేషన్‌ను సందర్శించి తమ సందేశాన్ని వినిపించారు.

నేడు వేడుకలు

ఆకాశవాణి కేంద్రం ప్రారంభమై 31 ఏళ్లు అయిన సందర్భంగా ప్రోగ్రామ్ హెడ్ ప్రశాంత్ కిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కేంద్రంలో 31 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

కవులు, కళాకారులకు ప్రోత్సాహం



మార్కాపురం ఆకాశవాణి కేంద్రం ద్వార జిల్లాలోని కవులను, కళాకారులను ప్రోత్సహిస్తున్నాం. తెరమరుగైపోతున్న జానపద కళాకారులను పిలిపించి వారిలోని కళను రికార్డు చేసి ప్రజలకు వినిపిస్తున్నాం. ఈ విషయంలో స్టేషన్ సాంకేతిక సిబ్బంది సహకారం మరువలేనిది. వాట్సప్, ఉత్తరాల ద్వారా శ్రోతలు కోరుకున్న సినిమా పాటలను ప్రసారం చేస్తున్నాం. క్యాజువల్ అనౌన్సర్స్ సేవలు మరచిపోలేం. కవులు, కళాకారులు నేరుగా స్టేషన్‌కు రావచ్చు.

– పి.ప్రశాంత్ కిరణ్, ప్రోగ్రామ్ హెడ్, ఏఐఆర్, మార్కాపురం

31 ఏళ్లుగా రేడియో వింటున్నా



మార్కాపురం రేడియో స్టేషన్ ప్రారంభమైనప్పటి నుంచి రోజూ రేడియో కార్యక్రమాలు వింటూ ఉంటా. కంభం రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి గుడి పక్కనే నా హోటల్, ఉదయం 6 గంటలకు రేడియో ఆన్ చేస్తే భక్తి రంజని, వార్తలు, రైతులకు సూచనలు, డాక్టర్ల కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు ఒకటేమిటీ అన్నీ వింటూ నా హోటల్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ వినిపిస్తూ ఉంటా. మంచి కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నారు.

– టి.గురునాథం, మార్కాపురం

రేడియో అంటే ప్రాణం



రేడియో అంటే ప్రాణం. రోజూ మార్కాపురం రేడియోలో వచ్చే వివిధ విద్య, వైజ్ఞానిక, ఆధ్యాత్మిక,సైన్సు కార్యక్రమాలువింటూ ఉంటాం.చాలావిషయాలు తెలుస్తుంటాయి. టీవీ చూడాలంటే మన పని మానుకోవాలి. రేడియో వింటూ మన పని చేసుకోవచ్చు.

– డాక్టర్ కె.మధుసూధన్, ప్రిన్సిపాల్, సాధన డిగ్రీ కళాశాల

పశుగణన పక్కాగా నిర్వహించాలి

- జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి



మాట్లాడుతున్న జేడీ బేబీరాణి

ఒంగోలు సెంట్రల్: సెప్టెంబర్ ఒకటి నుంచి మొదలుకానున్న 21వ పశుగణన సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.బేబీరాణి పేర్కొన్నారు. పశుగణన సర్వేపై ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు రంగారాయుడు చెరువు వద్ద ఉన్న పశుసంవర్ధక శాఖ సమావేశ మందిరంలో గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. 15 రకాల అంశాలతో చేపడుతున్న ఈ సర్వేలో పొరపాట్లకు తావుండకూడదని స్పష్టం చేశారు. ఈ గణాంకాలు రానున్న రెండు మూడేళ్లపాటు పథక నిర్దేశం, బడ్జెట్ కేటాయింపులకు ఉపయోగపడతాయన్నారు. పశుగణనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సహాయ సంచాలకులు, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ పి.చంద్రమోహన్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం



తీవ్ర గాయాలపాలైన వంశీ, అతని బాబాయి

మద్దిపాడు: జాతీయ రహదారిపై వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని వెంకట్రాజుపాలెం సమీపంలో జాతీయరహదారిపై గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. నాగులుప్పలపాడు మండలం కె.తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన వంశీ, అతని బాబాయితో కలిసి బైక్‌పై ఒంగోలు వెళ్తున్నాడు. వెంకట్రాజుపాలెం సమీపంలో వీరి బైక్‌ను వెనుక నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న ఛత్తీస్‌ఘఢ్ రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన కారు ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న వంశీ రోడ్డుపై పడిపోగా, వెనుక కూర్చున్న అతని బాబాయి ఎగిరి కారుపై పడి రోడ్డు మీద పడ్డాడు. ఇద్దరికీ తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

నూతన క్రిమినల్ చట్టాలు రద్దు చేయాలి



జిల్లా కోర్టు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఒంగోలు: నూతనంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు చట్టాలు రద్దు చేయాలని ఐలు, ఐఏఎల్, ఒంగోలు బార్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జిల్లా కోర్టు వద్ద న్యాయవాదులు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు.భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారత సాక్ష్య అధినియం పోలీసులకు విస్తృతమైన అధికారాలు కల్పించే విధంగా ఉన్నాయని, ప్రజల స్వేచ్ఛ, పౌర హక్కులకు భంగం కలిగించేలా, న్యాయ వ్యవస్థ అధికారాన్ని తగ్గించే విధంగా ఉన్న ఈ క్రిమినల్ చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగిశెట్టి మోహన్ దాస్, ఏల్చూరి సురేంద్రబాబు, కోశాధికారి గోపిశెట్టి లక్ష్మీనారాయణ, ఐలు జిల్లా కార్యదర్శి ఎండీ యాసిన్, డి.ఏడుకొండలు, ఐఏఎల్ జిల్లా కార్యదర్శి పోలినేని వెంకటేశ్వర్లు, న్యాయవాదులు ఎ.రాఘవులు, పి.బాబూరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల రైతులు నష్టపోకూడదు

కొత్తపట్నం: రొయ్యల రైతులు నష్టపోకూడదన్న ఉద్దేశంతో గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో కొప్పోలు, అల్లూరు, కొత్తపట్నం గ్రామాల్లో రొయ్యల రైతులతో గురువారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి ఉన్న హేచరీల్లోనే రొయ్య పిల్లలు కొనుగోలు చేసి రశీదు తీసుకోవాలని సూచించారు. రొయ్య పిల్లలను కొనే ముందు పరీక్షించుకోవాలని చెప్పారు. ఆక్వా రైతులు సీఏఏ, సీవోసీ సర్టిఫికెట్లు తీసుకోకుంటే ప్రభుత్వ రాయితీలు కోల్పోతారని స్పష్టం చేశారు. ఫారెస్ట్, దేవదయ భూములు, డీకే భూముల్లో కూడా తప్పనిసరిగా సీఏఏ పర్మిషన్ తీసుకోవాలని చెప్పారు. క్రాప్ హాలిడే ఇచ్చి కల్చర్ చేస్తే రొయ్యలు బాగా పెరుగుతాయని రైతులకు తెలియజేశారు. రొయ్యల చెరువులకు ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందని, ప్రతి రైతు ప్రీమియం చెల్లించాలని సూచించారు. అప్సడా లైసెన్స్ కూడా తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రొయ్యల చెరువుల్లో యాంటీబయోటిక్ మందులు వాడవద్దని రైతులను హెచ్చరించారు. మడనూరులో హర్షిణి హేచరీ, రాజుపాలెంలో పద్మావతి హేచరీని జేడీ తనిఖీ చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ ఉషాకిరణ్, ఎఫ్‌డీవో రవికుమార్, కొత్తపట్నం ఎఫ్‌డీవో ఆశా, ఫిషరీష్ అసిస్టెంట్లు స్వర్ణలత, స్వప్న, రైతులు పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో బంగారం చోరీ

టంగుటూరు: గుర్తు తెలియని దుండగులు సినీ ఫక్కీలో బంగారం చోరీకి పాల్పడిన సంఘటన టంగుటూరు సమీపంలో బుధవారం చోటుచేసుకోగా గురువారం వెలుగు చూసింది. వివరాలు.. కొరిశపాడు మండలం దైవాలపాడు గ్రామానికి చెందిన ముమ్మిన చిన్నమ్మాయి(64) టంగుటూరులో బుధవారం బంధువుల ఇంట వివాహానికి హాజరయ్యేందుకు మేదరమెట్లలో ఒంటరిగా బస్సు ఎక్కింది. పెళ్లి కావడంతో ఇంట్లో ఉన్న 12 సవర్ల బంగారు ఆభరణాలను తన హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకుంది. ఒంగోలు డిపోలో బస్సు దిగి టంగుటూరు వచ్చేందుకు మరో బస్సు ఎక్కింది. టంగుటూరు బస్టాండ్ సెంటర్‌లో బస్సు దిగి వివాహానికి హాజరైంది. అక్కడ బ్యాగు తెరిచి చూడగా బంగారం కనిపించలేదు. బ్యాగును కత్తిరించిన ఆనవాళ్లు కూడా లేకపోవడంతో వృద్ధురాలు ఖంగుతింది. బంధువులకు విషయం చెప్పి బోరున విలపించింది. టంగుటూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పున్నారావు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో విద్యార్థి ఆత్మహత్య



మృతుడు అచ్చేశ్వరరావు

యర్రగొండపాలెం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వైపాలెం మండలంలోని గోళ్లవిడిపిలో చోటుచేసుకుంది. గ్రామంలోని మాలపాలేనికి చెందిన పోలు అచ్చేశ్వరరావు(19) గుంటూరులోని ఒక కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబంలో నెలకొన్న ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఇంట్లో ఎవరులేని సమయంలో తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



సరళ మృతదేహం

యర్రగొండపాలెం: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గోళ్లవిడిపిలో గురువారం చోటుచేసుకుంది. మాదిగపాలేనికి చెందిన సంత్రపాటి సరళ(21) గత కొన్ని రోజులుగా ఇంట్లో చోటుచేసుకుంటున్న కలహాలతో మానసిక వేదనకు గురైందని, స్నానం చేసి వస్తానని తోటివారికి చెప్పి ఇంట్లోకి వెళ్లిన ఆమె చీరతో ఉరివేసుకొని మృతి చెందిందని పోలీసులు తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు.

అక్రమ పొగాకు విక్రయాలు నేరం

- టుబాకో బోర్డు ఈడీ శ్రీధర్ బాబు



వేలాన్ని పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు

టంగుటూరు: పొగాకు అక్రమ విక్రయాలు చట్టరీత్యా నేరమని టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం టంగుటూరు పొగాకు వేలం కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. రానున్న సీజన్లో పంట పరిమాణాన్ని స్థిరీకరించడం, ఉత్పత్తి నియంత్రణ వెనుక కారణాలను వివరించారు. రైతులు బ్యారన్‌లు, పొలాలను అధిక ధరకు కౌలుకు తీసుకోవద్దని హెచ్చరించారు. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగం తగ్గిందని వీలైనంతవరకు రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. అనంతరం టంగుటూరు వర్జీనియా పొగాకు ఉత్పత్తిదారుల సంఘం, రైతులు ఈడీతోపాటు మేనేజర్లు, వేలం నిర్వహణాధికారిని సన్మానించారు. కార్యక్రమంలో ఆక్షన్ మేనేజర్ దివి వేణుగోపాల్, ఆర్ఎం లక్ష్మణరావు, వేలం నిర్వహణాధికారులు కేవీ రామాంజనేయులు, ఎ.శ్రీనివాసరావు, సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ జి.సిద్ధరాజు, రైతు సంఘం అధ్యక్షుడు పోతుల నరసింహారావు, బోర్డు సిబ్బంది, అన్ని కంపెనీల ప్రతినిధులు, ఉప్పలపాడు పొగాకు రైతులు పాల్గొన్నారు

పాకల తీరంలో సోనాబోట్ల హల్‌చల్



పాకలలో తీరానికి దగ్గరగా చేపల వేట సాగిస్తున్న సోనాబోట్లు

సింగరాయకొండ: మండలంలోని పాకల తీరంలో గురువారం సోనాబోట్లు హల్‌చల్ చేశాయి. తమిళనాడు రాష్ట్రం కడలూరు ప్రాంతానికి చెందిన సుమారు 90 సోనా బోట్లు చేపల వేట సాగించాయి. సముద్ర తీరప్రాంత నిబంధనల ప్రకారం సోనాబోట్లు తీరానికి 8 నాటికల్ మైళ్లకు అవతల మాత్రమే చేపల వేట సాగించాలి. కానీ తీరానికి అతి సమీపంలో వేట సాగించడంతో వేలాది రూపాయల విలువైన వలలు తెగిపోతున్నాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే మత్స్య సంపద చిక్కక అల్లాడుతున్నామని, సోనాబోట్ల కారణంగా దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా చేపల వేట బాగోలేదని, దీంతో గురువారం అసలు వేటకే వెళ్లలేదని మత్స్యకారులు పేర్కొన్నారు. సోనాబోట్లను కట్టడి చేయకుంటే తమకు పస్తులే గతి అని వాపోయారు.

ఒంగోలు డీఎస్పీగా శ్రీనివాసరావు

- పలువురు సీఐలకు పోస్టింగ్

ఒంగోలు టౌన్: ఒంగోలు డీఎస్పీగా రాయపాటి శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర డీజీపీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం శ్రీకాకుళం దిశ డీఎస్పీగా పనిచేస్తున్న రాయపాటి శ్రీనివాసరావును ఒంగోలుకు బదిలీ చేశారు. ఆయన గతంలో ఒంగోలులోని తాలుకా పోలీస్ స్టేషన్ ప్రొబేషనరీ ఎస్సైగా, ఒంగోలు టూటౌన్, దర్శి ఎస్సైగా, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇంకొల్లు సీఐ, డీసీఆర్‌బీ సీఐగా, ఎస్బీ డీఎస్పీగా విధులు నిర్వహించారు. కాగా ఒంగోలు దిశ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావును గన్నవరం ఎస్‌డీపీఓగా బదిలీ చేశారు.

పలువురు సీఐల బదిలీలు

వీఆర్‌లో ఉన్న సీఐ ఎస్.శ్రీకాంత్‌కు ఒంగోలు రూరల్ సర్కిల్‌లో పోస్టింగ్ ఇచ్చారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న వై.రామారావును దర్శి సీఐగా నియమించారు. చీరాల టూటౌన్ సీఐ జి.సోమశేఖర్‌ను కొండపి సర్కిల్‌కు, కంభం సీఐ జె. రామకోటయ్యను గిద్దలూరు సర్కిల్‌కు బదిలీ చేశారు. మాచర్ల రూరల్ సీఐ కె.సురేష్‌ను గిద్దలూరు యూపీఎస్ సీఐగా బదిలీ చేస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు.